క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అమ్రాబాద్: మండలంలో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ రమేష్, లైన్‌మెన్‌లు శంకర్‌గౌడ్, ఆంజనేయులు తెలిపారు. విద్యుత్ లైన్ వెంటున్న చెట్లను తొలగించే పనులు కొనసాగుతున్నాయని, ఇందుకోసం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 33 లెవెన్ కేవీ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

ద్విచక్రవాహనం వేలం

నాగర్‌కర్నూల్ క్రైం: అక్రమంగా సారా తరలిస్తున్న క్రమంలో పట్టుబడిన ద్విచక్ర వాహనాన్ని ఈ నెల 27న జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ స్టేషన్‌లో ఉదయం 10 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ ఏడుకొండలు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ.5,000 డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనాలని కోరారు. ఒకవేళ వేలంలో వాహనం దక్కకుంటే డిపాజిట్ నగదును వేలందారులకు తిరిగి చెల్లించనున్నట్లు తెలియజేశారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



బిజినేపల్లి: మండలంలోని గౌరారం నుంచి గౌరారం తండా వరకు రూ.63 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం కోసం ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. అంతేకాకుండా పాలెం బస్టాండ్ ప్రాంగణంలో సీసీ రోడ్డు నిర్మాణం కోసం రూ.26 లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. త్వరలోనే టెండర్ పిలిచి పాలెం బస్టాండ్ ఆవరణలో సీసీ రోడ్డు పూర్తి చేస్తామన్నారు. ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం



కల్వకుర్తి రూరల్: మండలంలోని తుర్కలపల్లి గేటు నుంచి వేపూరు వరకు దాదాపు రూ.కోటి వ్యయంతో రోడ్డు పనులు చేపడుతున్నామని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గోవర్దన్ తెలిపారు. బుధవారం రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్‌ఎంపీపీ మాట్లాడారు. రహదారి ఇబ్బందులు తొలగించాలని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను కోరడంతో నిధులు మంజూరు చేశారన్నారు. మనోహర్‌రెడ్డి, తిరుపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తరగతి గదుల నిర్మాణాలకు భూమి పూజ



లింగాల: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలకు 'మన ఊరు–మన బడి' పథకంలో మంజూరైన తరగతి గదుల నిర్మాణం పనులకు బుధవారం మాజీ జెడ్పీటీసీ మాకం తిర్పతయ్య భూమి పూజ చేశారు. నూతన గదుల నిర్మాణాలకు రూ.39 లక్షలు మంజూరైనట్లు చెప్పారు. నూతన గదుల నిర్మాణాలను చేపట్టేందుకు శిథిలావస్థకు చేరిన గదులను తొలగించామన్నారు. పనుల్లో నాణ్యత ఉండాలని, పనులను సకాలంలో పూర్తిచేయించాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. తిర్పతయ్య, వెంకటగిరి, మల్లేష్ పాల్గొన్నారు.

జూపల్లి హయాంలోనే అభివృద్ధి పనులు

కొల్లాపూర్: మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు హయాంలోనే కొల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధి పనులకు సంబంధించిన నిధులు మంజూరయ్యాయని ఆయన అనుచర నాయకులు తెలియజేశారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. తన హయాంలోనే అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సమావేశంలో రఘుపతిరావ్, కౌన్సిలర్లు రహీంపాషా, నయూమ్, రమ్యకుమారి, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

బహుజనులకే రాజ్యాధికారం

తాడూరు: బడుగుబలహీన వర్గాలు అభివృద్ధి చెందాలంటే రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని జనసేన నేత లక్ష్మణ్‌గౌడ్ అన్నారు. బుధవారం 44వ రోజు పాదయాత్రలో భాగంగా మండలంలోని పర్వతాయ్‌పల్లి, శిర్సవాడ, పాపగల్ గ్రామాల్లో పాదయాత్ర చేపట్టారు.

ఆర్థిక సాయం అందజేత

కల్వకుర్తి రూరల్: మండలంలోని బెక్కెరకి చెందిన రామకృష్ణ కుమారుడు వివేక్ ప్రమాదవశాత్తు వేడీసీటిలో పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. బుధవారం ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి ఆస్పత్రికి వెళ్లి పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు.

అకాల వర్షం.. అన్నదాత ఆగం

నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో మంగళవారం రాత్రి ఈదురుగాలు, వడగండ్లు, ఉరుములు మెరుపులతో వర్షం కురిసింది. దీంతో చేతికి వచ్చిన వరి పంట నేలవాలింది. మామిడి కాయలు రాలిపోయాయి. కోసి నిల్వ చేసిన వరిధాన్యం కల్లాలు, మార్కెట్ యార్డుల్లో తడిసిపోయింది.

- కల్వకుర్తి మండలంలో వరిచేళ్లు దెబ్బతినడంతో పాటు మామిడి తోటల్లో కాయలు నేలరాలాయి.
- కొల్లాపూర్‌లో 34.4 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది.
- పెంట్లవెల్లి: బుధవారం తెల్లవారుజామున భారీగా ఈదురు గాలులు, వర్షం కురవడంతో జటప్రోల్, గోపులాపూర్ గ్రామాల్లోని వరి కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం తడిసిపోయింది. గోపులాపూర్‌లో కొన్ని చోట్ల నష్టపోయిన వేరుశనగ, వరి పంటలను వ్యవసాయ అధికారులు రవి, నాగరాజు పరిశీలించారు. పెంట్లవెల్లి నుంచి కొల్లాపూర్ వెళ్లే ప్రధాన రహదారిపై భారీ వృక్షం విద్యుత్ తీగలపై విరిగి పడింది.



తిమ్మరాసిపల్లిలో నేలకొరిగిన వరిచేను

- కోడేరు మండలంలో ఈదురు గాలులలకు మామిడి కాయలు నేలరాలాయి. గ్రామానికి చెందిన రైతు నర్సింహ వరి పంట కోసి ఆరబెట్టగా రాత్రి కురిసని అకాల వర్షానికి తడిసి ముద్దయింది.
- వెల్దండ మండలంలోని ఆయా గ్రామాల్లో వరి, మొక్కజొన్న పంటలను మండల వ్యవసాయ అధికారిణి మంజుల పరిశీలించారు. ఈదురు గాలులకు చెట్లు పడి విద్యుత్ వైర్లు, స్తంభాలు విరిగిపడ్డాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

– 'సాక్షి' నెట్‌వర్క్

నష్టంపై అంచనా వేయాలి

వెల్దండ: అకాల వర్షాలకు నష్టపోయిన వివిధ పంటల నష్టపరిహారం అంచనా వేయాలని కల్వకుర్తి ఆర్డీఓ రాజేష్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వ్యవసాయ అధికారులు, రెవెన్యూ అధికారులు సమష్టిగా పంట పొలాలను పరిశీలించాలన్నారు. గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన పంటల వివరాలు, రైతుల వివరాలను పూర్తి నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

అచ్చంపేట రూరల్: మండలంలోని ఏజెన్సీ గ్రామాల్లో బుధవారం వ్యవసాయాధికారులు వరి పంటను పరిశీలించారు. మంగళవారం తెల్లవారుజామున ఈదురు గాలులు, చిన్నపాటి వర్షం పడింది. మండలంలో 8.2 మి.మీల వర్షపాతం నమోదైంది. చందాపూర్ గ్రామ శివారులో ఏడీఏ చంద్రశేఖర్, ఏఓ కృష్ణయ్య, ఏఈఓ ప్రియ పంటలను పరిశీలించారు.

అప్రమత్తంగా ఉండాలి

చారకొండ: అకాల వర్షాల ప్రభావంతో పంటలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా పంటను ముందస్తుగా సేకరించాలని మండల వ్యవసాయ అధికారి చిన్న హుస్సేన్ అన్నారు. మండలంలోని సిర్సనగండ్లలో బుధవారం మండల వ్యవసాయ అధికారి చిన్నహుస్సేన్ వరి పంట పొలాల్లో తిరిగి పరిశీలించారు. మంగళవారం రాత్రి కురిసిన వర్షాలకు పంట నష్టంపై మండలంలోని ఆయా గ్రామాల ఏఈఓల ద్వారా పంట నష్టంపై వివరాలను సేకరించారు. వారి వెంట ఏఈఓలు, రైతులు ఉన్నారు.



వెల్దండలో వర్షానికి దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న ఏఓ మంజుల



వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ చిన్న హుస్సేన్



గోపులాపూర్‌లో ధాన్యం పరిశీలిస్తున్న అధికారులు

పెండింగ్ బిల్లులతో అభివృద్ధి ఎలా సాధ్యం

- మిషన్ భగీరథ పనులపై నిర్లక్ష్యం తగదు
- మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆందోళన



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అరుణ

ఉప్పునుంతల: ఏడాది కిందట ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో చేపట్టిన సీసీ రోడ్లకు ఇదివరకు బిల్లులు ఇవ్వకుంటే ఇక గ్రామాల్లో అభివృద్ధి పనులు ఎలా చేపట్టాలని ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే చేసిన పనులకు బిల్లులు సకాలంలో ఇవ్వకపోవడంతో సర్పంచ్‌లు ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దాంతో పాటు మిషన్ భగీరథ పనులు ఏళ్ల తరబడిగా సాగదీస్తూ.. అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తిప్పర్తి అరుణ అధ్యక్షతన నిర్వహించిన మండల సమావేశంలో పలు సమస్యలను సభ్యులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గత సర్వసభ్య సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను ఎంత వరకు పరిష్కరించారంటూ ఎంపీటీసీ రంగారెడ్డి సర్పంచ్‌లు కట్టా సరిత, మల్లారెడ్డి అధికారులను ప్రశ్నించారు. ఐకేపీ ద్వారా అమలు చేస్తున్న ఆహార ఉత్పత్తుల యూనిట్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరపడంతో పాటు వాటిపై గ్రామాల్లో మహిళలకు మరింత అవగాహన కల్పించాలని సదగోడు సర్పంచ్ మల్లారెడ్డి కోరారు.

- ఎస్‌డీఎఫ్ నిధులు కేవలం ఉప్పునుంతల, ఈరట్వానిపల్లికి మాత్రమే కేటాయించారని అన్నారు.
- ఫిరట్వానిపల్లి సమీపంలోని ఎఫ్‌డీఎస్ ఊట కుంటకు లేని ఆయకట్టు ఉందని చూపించి స్వార్థంతో అలుగు ఎత్తు పెంచడంతో కొంత మంది రైతుల భూములు మునిగిపోయి నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని సర్పంచ్ శివుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ అనంతప్రతాప్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సత్తు భూపాల్‌రావు, ఎంపీడీఓ లక్ష్మణ్‌రావు, తహసీల్దార్ శైలేంద్రకుమార్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎంపీ రాములుకు వినతి



కల్వకుర్తి రూరల్: మండలంలోని మార్చాల గ్రామ అభివృద్ధికి రూ.కోటి నిధులు మంజూరు చేస్తున్నట్లు నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు రాములు చెప్పారు. మార్చాల సర్పంచ్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఎంపీ రాములును కలిసి అభివృద్ధికి సహకరించాలని వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడారు. గ్రామంలో పోస్టాఫీస్ భవన నిర్మాణానికి రూ.50 లక్షలు, మసీద్ నుంచి హైస్కూల్ వరకు రూ.50 లక్షల వ్యయంతో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నట్లు హామీ ఇచ్చారు. వెంకట్‌రెడ్డి, జంగయ్య, మల్లేష్, మదన్‌మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

వరిధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ఉప్పునుంతల: పీఏసీఎస్ ఆధ్వర్యంలో స్థానిక గోదాం వద్ద వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం జెడ్పీటీసీ అనంతప్రతాప్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సత్తు భూపాల్‌రావు, తదితరులు ప్రారంభించారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని 9 గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను రైతులకు అందుబాటులో ప్రారంభించామన్నారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తెచ్చి ప్రభుత్వం అందిస్తున్న గిట్టుబాటు ధరను పొందాలని సూచించారు. సర్పంచ్ కట్టా సరిత, పురుషోత్తంరావు, గోపాల్ రెడ్డి, రవీందర్‌రావు, సునీత, మంజుల, కొత్త చిన్న జంగిరెడ్డి, కట్టా అనంతరెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఏర్పాటు

కొల్లాపూర్: కొల్లాపూర్ నుంచి జగద్గిరి గుట్టకు ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేశారు. బుధవారం లాంఛనంగా బస్సు రాకపోకలను ప్రారంభించారు. ప్రతి రోజూ సాయంత్రం 3.45 గంటలకు కొల్లాపూర్ నుంచి బస్సు బయలుదేరుతుందని డీఎం రాజేశ్వర్ తెలిపారు. నైట్‌హాల్ట్ అక్కడే ఉండి తెల్లవారుఝామున 6 గంటలకు తిరుగు ప్రయాణం అవుతుందన్నారు.

నేడు దయల్ యువర్ డీఎం

ఆర్టీసీ ప్రయాణికుల సలహాలు, సూచనల కోసం గురువారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు దయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఎం రాజేశ్వర్ వెల్లడించారు. సెల్ నం.9000405878 కు ప్రయాణికులు ఫోన్ చేయాలని సూచించారు.



బీసీ జనాభా గణనకు తీర్మానం చేయాలి

నాగర్‌కర్నూల్ రూరల్: అగ్రవర్ణాల వారు బీసీ కులాలను అణగదొక్కుతూ దోచుకుంటున్నారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు పెద్దయ్య యాదవ్ ఆరోపించారు. బుధవారం బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటూ రాజ్యాధికారం దక్కకుండా చూస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ జనాభా గణనకు తీర్మానం చేసి పంపించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లా అధ్యక్షుడు నిరంజన్, మల్లేష్‌గౌడ్, రవీందర్‌గౌడ్, కొత్త శ్రీను, వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన

కల్వకుర్తి రూరల్: కూలీల కోసం ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఆంజనేయులు కోరారు. బుధవారం మండలంలోని తాండ్రలో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. కూలీల హాజరును తనిఖీ చేశారు. అనంతరం మార్చాలలో నర్సరీలను పరిశీలించారు.

మస్టర్ల పరిశీలన

తాడూరు: మండలంలోని ఆయా గ్రామాల్లో ఉపాధి పనులు కొనసాగుతున్నాయని ఎంపీడీఓ గంగామోహన్ తెలిపారు. బుధవారం మండలంలోని మేడిపూర్‌లో నిర్వహిస్తున్న పనులకు సంబంధించి మస్టర్లను పరిశీలించారు.



కల్వకుర్తిలో పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పాడిరైతులకు అందుబాటులో పశువైద్యం



పశువులకు వైద్యం అందిస్తున్న అధికారులు

చారకొండ: మండలంలోని గ్రామాల్లో పశువైద్యంపై ఎప్పటికప్పుడు శ్రద్ధ వహిస్తూ.. పాడి రైతులకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని మండల పశువైద్య అధికారి శివకుమార్ అన్నారు. మండలంలోని జూపల్లిలో బుధవారం గేదెల షెడ్ వద్దకు వచ్చి పశువులకు వైద్యం అందించారు. పశువులకు కావాల్సిన దాన, పాల ఉత్పత్తికి కావాల్సిన ప్యాడి, పశువులకు టీకాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మండలంలో ఇటీవల దళితబంధు పథకంలో ఇటీవల ఆయా గ్రామాల్లో లబ్ధిదారులు గేదెల యూనిట్లు పొందడంతో గేదెల పెంపకం, పాడిపరిశ్రమ అధికంగా ఉండటంతో ఆయా గ్రామాల్లో పశువైద్యం కోసం డాక్టర్లను నియమించినట్లు చెప్పారు. పశువైద్యంపై ఎప్పటికప్పుడు వైద్య అధికారులను సంప్రదించాలని తెలియజేశారు.

కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లా వ్యాప్తంగా రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే భేషరతుగా కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్దం పర్వతాలు డిమాండ్ చేశారు. బుధవారం మండల సమితి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అశోక్, శివ పాల్గొన్నారు.

మేడే ఉత్సవాలను జయప్రదం చేయండి

నాగర్‌కర్నూల్ రూరల్: ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా మే 1 నుంచి 7వ తేదీ వరకు మే డే వారోత్సవాలు నిర్వహించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పొదిల రామయ్య పిలుపునిచ్చారు. బుధవారం మే డే సన్నాహక సమావేశం నిర్వహించి మాట్లాడారు. చికాగో నగరంలో కార్మికుల శ్రమదోపిడీకి వ్యతిరేకంగా జరిగిన పోరాటమే మేడే అని పేర్కొన్నారు. దేశానికి సంపద సృష్టిస్తున్న కార్మిక వర్గాన్ని మోదీ గుర్తించాలన్నారు. పబ్లిక్, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు సంఘం నాయకులు రామకృష్ణ, తిరుపతయ్య, చింత శివ, బాలస్వామి, శంకర్ వెంకటేష్ పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్. శ్రీనివాసులు అన్నారు. బుధవారం పట్టణంలోని టీఎస్‌జీఓ భవనంలో సీఐటీయూ అనుబంధ సంఘాల నాయకులతో మేడే సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దేశ్యానాయక్, మల్లేష్, శంకర్‌నాయక్, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.



అచ్చంపేటలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

సివిల్ సప్లయ్ చైర్మన్‌ను కలిసిన మిల్లర్లు

కల్వకుర్తి: రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్‌ను బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా రైస్‌మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు జూలూరి రమేశ్ బాబు ఆధ్వర్యంలో మిల్లర్లు చైర్మన్‌ను కలిశారు. ఈ సందర్భంగా మిల్లర్ల సమస్యలను పరిష్కరించాలని కోరినట్లు రమేశ్‌బాబు విలేకరులకు తెలియజేశారు. రవీందర్‌సింగ్‌ను మిల్లర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో శాలువాలతో సన్మానించారు. మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు సురేందర్, నరేష్ యాదవ్ పాల్గొన్నారు.



సన్మానిస్తున్న రమేశ్‌బాబు తదితరులు

వెల్దండలో ముదిరాజ్‌ల ర్యాలీ

వెల్దండ: మండల కేంద్రంలో బుధవారం ముదిరాజ్ కులస్తులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ముదిరాజ్ కులస్తులను బీసీ–డీ నుంచి బీసీ–ఏలో చేర్చాలన్నారు. ఏళ్లుగా పోరాటం చేస్తున్నా.. ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేపల పెంపకానికి నిధులు మంజూరు చేయాలన్నారు. అనంతరం కల్వకుర్తిలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశానికి ఉమ్మడి మండలం నుంచి ముదిరాజ్ కులస్తులు భారీగా తరలివెళ్లారు. ముదిరాజ్ సంఘం నాయకులు వెంకటయ్య ముదిరాజ్, శేఖర్‌ముదిరాజ్, నూకం వెంకటయ్య, కృష్ణముదిరాజ్, మల్లయ్య, మల్లేష్‌ముదిరాజ్, శ్రీశైలం, బాలకృష్ణ తదితరులు ఉన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న సంఘం నాయకులు

సీపీఆర్‌పై అవగాహన అవసరం



చారకొండలో అవగాహన కల్పిస్తున్న అధికారులు



లింగాల సీహెచ్‌సీలో..

చారకొండ: గుండె పోటు వచ్చిన వారికి వెంటనే సీపీఆర్ సరైన పద్ధతిలో చేస్తే వారి ప్రాణాలను రక్షించవచ్చని జిల్లా వైద్యాధికారి శ్యామ్‌ప్రసాద్ రెడ్డి అన్నారు. మండలంలోని రైతు వేదికలో బుధవారం సీపీఆర్‌పై ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పోలీస్, మీడియా ప్రతినిధులు తదితరులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా వైద్యాధికారితో పాటు బృందం సభ్యులు హాజరై అవగాహన కల్పించారు. గుండె, ఊపిరితిత్తుల పునరుజ్జీవనంపై వివరించి, ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జయసుధ, మండల వైద్యాధికారి మంజుల, భార్గవి, భాగ్యలక్ష్మి, సీహెచ్‌ఓ శేఖర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పలు శాఖల సిబ్బందికి..

లింగాల: మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమంలో బుధవారం ముగిసింది. మొదటి రోజు ఏఎన్‌ఎంలకు, ఆశ కార్యకర్తలకు శిక్షణ ఇవ్వగా రెండో రోజు పోలీసు, ఇతర శాఖల సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రశాంత్, వెంటకమ్మ, రాంచందర్, మల్లేష్ పాల్గొన్నారు.

వీధులు ఊడుస్తూ నిరసన



తెలకపల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న వీఓఏలు

తమ సమస్యలు పరిష్కరించాలని వీఓఏలు గత 10 రోజులుగా నిరవదిక సమ్మె చేస్తుంటే ప్రభుత్వం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 10వ రోజు బుధవారం చీపుర్లతో వీధులను శుభ్రం చేస్తూ ప్రభుత్వానికి నిరసన వ్యక్తంచేశారు.

– 'సాక్షి' నెట్‌వర్క్



పెంట్లవెల్లిలో..

చదువుతోనే సమాజ అభివృద్ధి సాధ్యం

తెలకపల్లి: చదువుతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని మిషన్ ఎడ్యుకేషన్ ఫౌండర్ ఎక్సైజ్ సీఐ ఏడుకొండలు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సీఎల్‌ఆర్ విద్యాసంస్థల్లో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ, స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణ ప్రేరణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజర మాట్లాడారు. చదువుతోనే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని, కుటుంబ గౌరవం, ఆర్థిక గౌరవ, అంతరాలు లేని సమాజం సాధ్యమవుతుందన్నారు. ప్రతిఒక్కరూ పరీక్షలు వచ్చినప్పుడే కాకుండా పోటీ పరీక్షలకు నిరంతరం కొంత సమయం కేటాయించి చదవాలన్నారు. అనంతరం ఆ విద్యాసంస్థల కరస్పాండెంట్ రాజమహేందర్‌రెడ్డి, నిర్వాహకులు, విద్యార్థులు ఎక్సైజ్ సీఐ ఏడుకొండలును ఘనంగా సన్మానించారు. ప్రకాశ్‌రెడ్డి, బాబయ్య, వెంకటేష్, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ ఏడుకొండలు